సాక్షి
విశాఖపట్నం

శనివారం । 14 । అక్టోబర్ । 2023



పాత పుస్తక లోకం IIలో

టర్నర్ చౌల్ట్రీ దగ్గర మొదలయ్యే పరిమళం.. పోలీస్ బ్యారెక్స్ వరకు తాకుతూనే ఉంటుంది. అదే పాత పుస్తకాల సుమధుర సువాసన.



కలెక్టర్ కప్ పోటీలు ప్రారంభం

కలెక్టర్ కప్ పోటీలను శుక్రవారం సిరిపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. IIలో

స్కేటింగ్‌లో సింధు బంగారం



అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో పెదగదిలికి చెందిన చిన్నారి సింధు బంగారు పతకాలు సాధించింది. IIలో

గుడ్లు తేలేస్తున్న కోళ్లు

- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉష్ణతాపం
- వేసవిని తలపించే వాతావరణమే కారణం
- 25 శాతం మేర పడిపోయిన గుడ్ల ఉత్పత్తి
- 10 శాతానికి పెరిగిన మరణాల రేటు
- నష్టాలు పాలవుతున్నామంటున్న పౌల్ట్రీ యజమానులు
- ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ఆవేదన



చల్లదనం కోసం కోళ్ల ఫారం స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: వేసవిని తలపించే ఉష్ణతాపం కోళ్ల పరిశ్రమను విలవిల్లాడిస్తోంది. వర్షాలతో చల్లని వాతావరణం ఉండాల్సిన తరుణంలో ఎండ తీవ్రత పౌల్ట్రీ పరిశ్రమను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. సాధారణంగా వేసవి మూడు నెలలు మినహా మిగతా నెలలన్నీ కోళ్లకు అనుకూల వాతావరణమే ఉంటుంది. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.

వేసవి ముగిసి మూడు నెలలైనా ఇంకా ఎండలు మండిపోతూనే ఉన్నాయి. సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగల ధాటికి ఫారాల్లో ఉన్న కోళ్లు గుడ్లు తేలేస్తున్నాయి. వర్షాకాలంలో ఫారాల్లో కోళ్ల మరణాలు 1–2 శాతం కూడా ఉండవు. కానీ కొన్నాళ్లుగా కాస్తున్న ఎండలకు మండు వేసవిలో మాదిరిగా 8–10 శాతం కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాదు గుడ్ల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతోంది. అధిక ఉష్ణోగ్రతలతో 25 శాతం మేర గుడ్ల ఉత్పత్తి క్షీణించిందని పౌల్ట్రీ యజమానులు అంటున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు ఎక్కువగా నీళ్లు తాగడం, మేత తక్కువగా తినడం వల్ల గుడ్ల ఉత్పత్తి పడిపోతోందని వీరు చెబుతున్నారు. మరోవైపు బ్రాయిలర్ కోళ్లదీ అదే పరిస్థితి. ఇవి కూడా ఎండల తీవ్రతను తట్టుకోలేక చనిపోతు న్నాయి. అసలే దేశంలో కోళ్ల మేత ధరలు భారంగా మారిన తరుణంలో ఉష్ణ వాతావరణం కొనసాగుతుండడం తమను నష్టాల పాల్జేస్తోందని వీరు ఆవేదన చెందుతున్నారు. కోళ్లు వేసవి ధాటిని తట్టుకోవడానికి పౌల్ట్రీ యజమానులు ఫారాల్లో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని స్ప్రే చేస్తున్నారు.

దీంతో కోళ్లు కాస్త ఉపశమనం పొందుతాయి. ప్రస్తుతం అక్టోబర్ నెలలోనూ వీరు ఇంకా స్ప్రింక్లర్లనే కొనసాగిస్తున్నారు. వర్షాలు కురవాల్సిన రోజుల్లో ఇలాంటి వేడి వాతావరణ పరిస్థితి గడచిన 30 ఏళ్లలో ఎన్నడూ చూడలేదని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ చౌదరి 'సాక్షి'కి చెప్పారు.

పెరుగుతున్న కోడిగుడ్ల ధరలు..

ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 45 కోడిగుడ్ల (లేయర్) ఫారాలున్నాయి. వీటిలో 50 లక్షలకు పైగా గుడ్లు పెట్టే కోళ్లున్నాయి. అలాగే వివిధ బ్రాయిలర్ ఫారాల్లో రెండు కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, ఫారాల్లో కోళ్లు చనిపోవడం వల్ల ఇటు గుడ్లు, అటు చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు పెరుగుతూ ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.540కి, కిలో చికెన్ ధర (స్కిన్‌లెస్) రూ.270కి చేరుకుంది. ఇలా వంద గుడ్లపై రూ.50, కిలో చికెన్‌కు రూ.40 చొప్పున పెరిగింది. మరో రెండు మూడు నెలల పాటు గుడ్ల కొరత కొనసాగుతుందని, ఫలితంగా వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ రంగ నిపుణులు చెబుతున్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు

- 16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక
- వైజాగ్‌లో ఇన్ఫోసిస్, పరవాడలో యుజియా ఫార్మా, లారస్ ల్యాబ్‌లకు శ్రీకారం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 16న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీని ప్రారంభిస్తారు. అనంతరం పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో అరబిందో యాజమాన్యం నిర్మించిన యుజియా (ఈయూజీఐఏ) పరిశ్రమను ప్రారంభించి, లారస్ ల్యాబ్ యాజమాన్యం తలపెట్టిన కొత్త పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. 16వ తేదీ ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నం.2కు చేరుకుని ఇన్ఫోసిస్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అక్కడ ప్రసంగించిన అనంతరం 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.15 గంటలకు పరవాడ చేరుకుంటారు. పది నిమిషాల పాటు ప్రజా ప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో గల యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారస్ ల్యాబ్‌కు చేరుకుని యూనిట్–2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈఓ, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం 2.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

ప్రజలతో మమేకమయ్యేలా..



పార్టీ ముఖ్యులతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి..చిత్రంలో డిప్యూటీ సీఎంలు బూడి, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్

- 26 నుంచి ఉత్తరాంధ్రలో సామాజిక బస్సు యాత్ర
- మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా బస్సు యాత్రకు ముహూర్తం ఫిక్స్ చేసింది. సామాజిక బస్సు యాత్ర పేరిట రాష్ట్రమంతా పర్యటించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ బస్సు యాత్రను ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయంతో పాటు.. జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

మహిళలకు, దళితులకు, వెనబడిన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు.. వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే భవిష్యత్తులో మరింత సువర్ణపాలన రానుందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం ఎంత అవసరమో ఈ బస్సు యాత్ర ద్వారా తెలియజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, పాలవలస విక్రాంత్, మజ్జి శ్రీనివాస్, కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దసరాకు యోగా థీమ్ పార్కు



థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పీఎంపాలెం: మధురవాడ జోన్–2లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కులో ప్లాంటేషన్ పూర్తి చేసి దసరా నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బక్కన్నపాలెంలోని స్పోర్ట్స్ థీమ్ పార్కు, ఎంఎస్‌ఆర్ లే అవుట్‌లోని బటర్‌ఫ్లై పార్కులను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, హాఫ్ బాస్కెట్ బాల్, మల్టీ ప్లే గ్రౌండ్ కోర్టులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ క్రమంలో యోగా థీమ్ పార్కు నిర్వహణకు అవకాశం ఇవ్వాలని వాల్‌చంద్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ పార్కులు ఆయా కాలనీలవాసుల కోసం అందుబాటులోకి తెస్తున్నామని, వాటిని పక్కాగా నిర్వహిస్తే తప్పకుండా అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్–2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఎస్ఈ శాంసన్ రాజు, డీడీహెచ్ ఏం.దామోదరరావు, ఈఈ శాంతిరాజు, ఏసీపీ శర్మ, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన అక్షయపాత్ర ప్రతినిధులు



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న అక్షయపాత్ర సభ్యులు

ఏయూక్యాంపస్: నౌకానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అక్షయపాత్ర సభ్యులు శుక్రవారం సందర్శించారు. అమెరికాలోని అక్షయ ప్రాత చాంబర్ సభ్యురాలు కవితతో కూడిన సభ్యుల బృందం పాఠశాలను సందర్శించి, విద్యార్థులు స్వయంగా భోజనం వడ్డించారు. అక్షయపాత్రలో సభ్యురాలిగా కావడం సంతోషాన్ని ఇచ్చిందని, చిన్నారులకు పోషకాహారాన్ని అందించే ప్రక్రియలో భాగం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని, అధ్యాపకులతో మాట్లాడారు. జాతీయ ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం అందుకున్న ఉమా గాంధీని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.కె.దుర్గ కుమారి తదితరులు పాల్గొన్నారు.

'కనక మహాలక్ష్మి' బ్యాంకుకు ఉత్తమ ఎన్‌పీఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న బ్యాంకు అధ్యక్షుడు, సీఈవో, ఏజీఎం

సీతంపేట: మధ్య తరహా అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకుకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్(నిరర్థక ఆస్తుల నిర్వహణ) అవార్డు లభించింది. ఇటీవల గోవాలో బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ నిర్వహించిన ఎన్‌సీబీఎస్–2023లో ఈ అవార్డు దక్కించుకుంది. బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ గ్రూప్ అధ్యక్షుడు బాబునాయక్, గోవా సహకార శాఖ మంత్రి సుభాష్ శిరోద్కార్ చేతుల మీదుగా బ్యాంక్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు, సీఈవో కె.శ్యామ్‌కిశోర్, ఏజీఎం(రుణాలు) పి.వీ రఘద్రరావు ఈ అవార్డును స్వీకరించారు. బ్యాంకు రజతోత్సవాలు సందర్భంగా ఈ అవార్డు పొందడం సంతోషంగా ఉందని రాంబాబు తెలిపారు.

టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.1.89 లక్షల లబ్ధి

ఆనందపురం : టీడీపీ నుంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన తాట్రాజు కృష్ణవేణికి వివిధ ప్రభుత్వ పథకాలు ద్వారా రూ.1.89 లక్షల లబ్ధి చేకూరింది. జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.87 వేలు, వైఎస్సార్ పింఛను కానుక ద్వారా రూ.82 వేలు, జగనన్న వసతి దీవెన ద్వారా రూ.20 వేలు లబ్ధిపొందారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆమెకు అందజేశారు.

పక్కాగా ఈవీఎంల ఫస్ట్‌లెవెల్ చెకింగ్

జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆదేశం



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్వో మోహన్‌కుమార్, డీసీవో ప్రవీణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్‌కిరణ్

సాక్షి, విశాఖపట్నం : ఈ నెల 16 నుంచి నవంబర్ 20 వరకు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ఎఫ్ఎల్‌సీపై సన్నద్ధత, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ జరుగుతుందన్నారు. 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఆయా టేబుల్స్‌లో డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ ఉండాలని సూచించారు. బెల్ కంపెనీ నుంచి 12 మంది ఇంజినీర్లు కూడా రానున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు నుంచి ఫొటోలతో ఆథరైజేషన్ లెటర్ తీసుకురావాలని, వారికి మాత్రమే ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు ప్రవేశం ఉంటుందని, ఈ విషయం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తెలియజేయాలని ఆదేశించారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను మీనా ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా నుంచి కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీసీవో టీ ప్రవీణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సుస్థిర సేవలు అందేలా ఏసీబీ కృషి

దొండపర్తి: ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సేవలలో అవినీతికి ఆస్కారం లేకుండా సుస్థిరమైన ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరే విధంగా అవినీతి నిరోధక శాఖ నిరంతరం కృషి చేయాలని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ రేంజ్(విశాఖ, అనకాపల్లి, అల్లూరి)కు చెందిన అధికారులతో డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలన అందేలా చూడాల్సిన బాధ్యత ఏసీబీపై ఉందని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ఏసీబీ 14400 కాల్ సెంటర్, ఏసీబీ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా నిరంతర నిఘాలో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులను గుర్తించడం, నిరంతర తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలపై విచారణ, సంభందిత అధికారులను గుర్తించడం వంటి చర్యలను చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులలో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అదే విధంగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన నిందితుల నేరాన్ని న్యాయస్థానంలో పూర్తి సాక్ష్యాధారాలతో నిరూపించి సకాలంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు.

ఉత్సాహంగా జాతీయ బాస్కెట్ బాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేంద్ర మంత్రి నారాయణ స్వామి

పీఎంపాలెం/మధురవాడ (భీమిలి) : భారతీయ విద్యా కేంద్రం 34వ విద్యాభారతి నేషనల్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు స్థానిక చంద్రంపాలెం హైస్కూల్‌లో శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. అండర్ 14 బాలికలు, అండర్ 19 బాలురు విభాగంలో జరిగే ఈ పోటీలను కేంద్ర మంత్రి నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యాకేంద్రం విశాఖ జిల్లా సహకారంతో జరుతున్న పోటీల్లో 19 బాలుర జట్లు , బాలిక జట్లు 21 తలపడుతున్నాయని మంత్రి తెలిపారు. విశాఖ కేంద్రంగా నాలుగు చోట్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం బాలికల పూల్ ఏలో రాజస్తాన్ క్షేత్ర–ఈస్ట్ యూపీ క్షేత్ర మధ్య పోటీలు జరగగా పూల్ బీ బాలికల పోటీలో దక్షిణ మధ్య క్షేత్ర–ఉత్తర మధ్య క్షేత్ర జట్ల మధ్య పోటీ జరిగిందని నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో మధ్య క్షేత్ర–రాజస్థాన్ క్షేత్ర జట్లకు సంబంధించి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ ముక్తాబ్ సింగ్ బాద్‌షా, విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ టీఆర్ఎస్ ప్రసాద్, అధ్యక్షుడు సనీల్ మహంతీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కేఎస్‌పీ చక్రవర్తి, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నృత్య వైభవం



నవ దేవి వైభవం నృత్యరూపకం

మద్దిలపాలెం: కూచిపూడి నాట్యాధిపతి డాక్టర్.వెంపటి చిన సత్యం జయంతి సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవం జరిగింది. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకను విజయనిర్మణ్ అధినేత సూరపనేని విజయకుమార్, వీపీఏడీఏ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకట రమణారావు, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, శుభలు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాక్షేత్రం పూర్వ విద్యార్థిని లక్ష్మీ ప్రసూన్న దేవి వైభవం నృత్యరూపకం, వీవీఎస్ జగన్నాథరావు శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శను ఆహూతులను అలరించింది. వెంకట్, తులసీదాసు శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి

అక్కిరెడ్డిపాలెం: మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), రాష్ట్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ అందిస్తున్న పథకాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి కోరారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో శుక్రవారం వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీఎం గణపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అభివృద్ధి విధానం 2023– 27ను వివరించారు. ఏపీ చాంబర్స్ ఉపాధ్యక్షుడు కె.వి.ఎస్.ఎ.వర్మ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ, పరిశ్రమల శాఖ కల్పిస్తున్న అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ పారిశ్రామికవేత్తల నుంచి సలహాలు, సూచనలు పొందేందుకు వాసీవాను వేదికగా చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పరిశ్రమల శాఖ అందిస్తున్న పథకాలు, టీసీ, ఎన్ఎస్ఐసీ, కేవీఐసీ, ఎస్ఐడీబీఐ తదితర అంశాలను వివరించారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, లీడ్ జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, అచ్యుతాపురం జి.ప్రసాద్‌రెడ్డి, కేవీఐసీ నోడల్ ఆఫీసర్ డి.సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఐడీ మేనేజర్ టి.కమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యువజనోత్సవాలు



యువజనోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు



వేదికపై సందడి చేస్తున్న షణ్ముఖ్ జశ్వంత్

- 52 కళాశాలల విద్యార్థుల కేరింతలు
- యూట్యూబ్ స్టార్ షణ్ముఖ్ జశ్వంత్ సందడి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో జరుగుతున్న ఎక్సెల్సియార్–23 యువజనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. సుమారు 52 కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మూకాభినయం, లఘు, హాస్య నాటికలు, ఫొటోగ్రఫీ ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆధ్వర్యంలో అతిథులు బహుమతులు అందజేశారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో విశిష్ట అతిథిగా యూట్యూబ్ స్టార్ షణ్ముఖ్ జశ్వంత్ సందడి చేశారు. తన తల్లి ఇదే కళాశాలలో చదువుకున్నారని జశ్వంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి విద్యా విహార్ ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ టి.భాస్కరసుధ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, సిస్టర్ నాన్సీ, సిస్టర్ మేరీ, అనుపమ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 134 మంది ఎంపిక

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 134 మంది ఎంపికయ్యారు. హనీ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామ్ జనరల్ ఇన్స్యూరెన్స్, వరణ్ మోటార్స్, హెటిరో లాబ్స్, జయభేరి ఆటోమోటివ్, గేమ్స్ సాఫ్ట్, రక్షిత్ బిజినెస్ సర్వీసెస్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ఆస్ట్రోటెక్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ తదితర కంపెనీల్లో 416 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టారు. 327 మందికి గానూ 134 మంది ఎంపికయ్యారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ఫలితాలకు హైకోర్టు బ్రేక్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పోస్ట్ ఫలితాలకు రాష్ట్ర హైకోర్టు బ్రేక్ వేసింది. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన ఎ.కె. సక్సేనా మోయిల్‌కు సీఎండీ వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీ అయింది. ఆ పోస్టుకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) ఆధ్వర్యంలో ఈనెల 11న వర్చువల్‌గా ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూకు అర్హత కల్పించని స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉన్నతాధికారి తనకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఇప్పటికే తేదీ ప్రకటించినందున ఇంటర్వ్యూలు జరుపుకోవచ్చని, అయితే కేసు తేలే వరకు ఫలితాలను వెల్లడించరాదని తీర్పునిచ్చారు. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేశారు.

సత్యదేవుని ముత్తంగి సేవకు ఆహ్వానం


ముత్తంగి సేవ ఆభరణాలు పరిశీలిస్తున్న శారదా పీఠాధిపతులు

సింహాచలం: కాకినాడ జిల్లా అన్నవరం వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో త్వరలో ప్రారంభించనున్న ముత్తంగి సేవకు హాజరు కావాలని కోరుతూ చినముషిడివాడలోని శారదా పీఠాధిపతులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి ముత్యాల ఆభరణాలను శుక్రవారం అన్నవరం దేవస్థానం అధికారులు, వేద పండితులు చూపించారు. ఈ నెల 16న ముత్యాల ఆభరణాలను అలంకరించి ఈ సేవను ప్రారంభించనున్నారు. వ్రత పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఆభరణాలను హైదరాబాద్‌కు చెందిన సుదీర్‌శర్మ తయారు చేశారు. సుమారు మూడు కిలోల బరువైన ముత్యాలు, మణులు, నవరత్నాలను ఆభరణాల తయారీ కోసం వినియోగించినట్టు వ్రత పురోహితుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ తెలిపారు. సేవ కోసం ప్రత్యేకంగా ముత్యాల గొడుగును కూడా తయారు చేయించామన్నారు. ప్రతి సోమవారం ముత్యాల ఆభరణాలను అలంకరించి ముత్తంగి సేవ నిర్వహిస్తామని ఆలయ ఏసీ రమేష్‌బాబు తెలిపారు. శారదా పీఠాధిపతులను కలిసిన వారిలో అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ మూర్తి, వేద పండితులు పురుషోత్తమ శర్మ, కొంపెల్ల మూర్తి, తదితరులు ఉన్నారు.



జగదాంబ కూడలికి కొంచెం ముందుకెళ్తే.. టర్నర్ చౌల్ట్రీ దగ్గర మొదలయ్యే పరిమళం.. పోలీస్ బ్యారెక్స్ వరకు తాకుతూనే ఉంటుంది. అదే పాత పుస్తకాల సుమధుర పరిమళం. అక్కడికి వెళ్లగానే మనసు తుమ్మెదలా మారుతుంది. రివ్వున పుస్తకాల మీద వాలుతుంది. చలం 'మైదానం' పై కలంతో ఆడిన ఆట.. 'అమృతం కురిసిన రాత్రి' రోజున తిలక్ నుంచి జాలువారిన మధురాక్షరాలు.. షేక్‌స్పియర్ రోమియో జూలియట్ ప్రణయ కావ్యపు పరిమళాలను ఆస్వాదిస్తుంటే అస్సలు టైమే తెలియదు. ఆ 'పాత' సుమధురం మనసును హాయిగా హత్తుకుంటుంది. ఇంకెందుకు ఆలస్యం.. శ్రీశ్రీలా 'పదండి ముందుకు.. పదండి తోసుకు..' అంటూ మనల్ని తొందర పెడుతుంది.

పాత పుస్తక లోకం

- పోలీస్ బ్యారెక్స్ రోడ్డులో ఓల్డ్ బుక్స్ స్టోర్స్
- ఇక్కడ దొరకని పుస్తకమే ఉండదు
- గతంలో కంటే తగ్గిన వ్యాపారం
- మక్కువతో ఇందులోనే కొనసాగింపు



ఏంటి పాత పుస్తకాలా? అని మొహం అట్లా పెట్టకండి. పేరుకే పాత.. కానీ లోపలంతా విజ్ఞాన సర్వస్వం. ఎన్నడూ చదవని కావ్యాలు.. కథలు.. సాహిత్యం.. వినోదం.. ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో.. ఎప్పుడూ చూడనవి ఒక్కసారి చూస్తే కొత్తవి కాక పాతవెలా అవుతాయి. అక్షరం పక్కన అక్షరం పేర్చినట్టు.. పుస్తకం పక్కన పుస్తకం. ఎన్ని ఇళ్లు తిరుగుంటాయి? ఎందరి చేతులు మారుంటాయో కదా!

ఎవరెవరివో... ఎక్కడెక్కడివో.. అలా వచ్చి ఇలా ఒక చోట చేరి పరిచయాలు చేసుకుంటాయి. ఎవరి చేతికో చేరాక భారంగా వీడ్కోలు చెప్పుకుంటాయి. పైగా అట్ట మాసిందనో.. లోపల పేపరు చిరిగిందనో.. ఇలాంటి చిన్ని చిన్న విషయాలకు అవి ఆత్మస్థైర్యం కోల్పోవు. వాటిని తదేకంగా చూస్తే.. అందులో విషయాన్ని సంగ్రహిస్తే మనలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. మనం సాధించాల్సిన లక్ష్యం నెరవేరుతుంది. ఒక్కసారి పుస్తకం పేజీ తిప్పి ఆ రుచిని ఆస్వాదించండి. అరకు కాఫీలా అదిరిపోతుంది. ఎండకాలంలో తాటి ముంజులు తిన్నంత సమ్మగా ఉంటుంది. అందులో నిక్షిప్తమైన శాస్త్రాలు.. కల్పనలు.. కావ్యాలు.. వింతలు.. విశేషాలు.. సాంకేతిక పరిజ్ఞానం.. ఒకటేమిటి సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరిగినట్టు.. మస్తిష్కం చుట్టూ అవి పరిభ్రమిస్తూనే ఉంటాయి. గాజుల సత్యనారాయణ పెద్ద బాలశిక్షో... భారవి రాసిన కిరాతార్జునీయమో.. షేక్‌స్పియర్ రాసిన రోమియో జూలియట్, రాబర్ట్ కియోసాకి రిచ్ డాడ్.. పూర్ డాడ్.. ఏదో ఒకటి.. కొన్నా.. కొనకపోయినా.. పుస్తకాలను చూడడం.. వాటిని తడమడం డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్.

సుమారు 40 ఏళ్ల కిందటి మాట. చౌల్ట్రీ దగ్గర వెలిసిందో పుస్తకాల షాపు. ఎస్కే బుక్‌స్టాల్. ఇదే విశాఖపట్నంలో మొదటి పాతపుస్తకాల షాపు అని చెబుతుంటారు. పుస్తకం చాలా మందికి వెలుగు చూపుతుంది. కానీ పుస్తకాల షాపు ఈ యజమాని కుటుంబానికి బతుకు చూపింది. ఇప్పుడు చౌల్ట్రీ, పోలీస్ కమిషనరేట్, అగ్నిమాపక కేంద్రంలో 40కి పైనే ఓల్డ్ బుక్ స్టోర్స్ విస్తరించాయి. అయితే ఒక్కప్పటిలా వీరి వ్యాపారం సాగడం లేదు. విస్తృతంగా ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో వీరి వ్యాపారం చతికిలపడింది. లాభమైనా.. నష్టమైనా ఇందులోనే వారంతా కొనసాగుతున్నారు. ఇక్కడి షాపుల్లో కేజీ నుంచి పీజీ వరకు పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, సివిల్స్, గ్రూప్స్, లా, హెల్త్ టిప్స్, సాహిత్యం, మెడికల్, ఇంజినీరింగ్.. ఇలా ఒకటేమిటి ఇక్కడ దొరకని పుస్తకమే ఉండదు.

విద్యా సంవత్సరం ప్రారంభంలో జోరుగా అమ్మకాలు..

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వ్యాపారం పుంజుకుంటుంది. సెకండ్ హ్యాండ్ పుస్తకాలను సగం ధరకు, కొత్త వాటిపై 10 నుంచి 20 శాతం డిస్కౌంట్‌పై విక్రయిస్తున్నారు. ఒకప్పుడు కథలు.. కవితలు.. సాహిత్య గ్రంథాలకు మంచి డిమాండ్ ఉండేది. రానురాను ఆ పుస్తకాలు చదివే వారు తగ్గారు... వాటిని కొనేవారు దూరమయ్యారు. మొదట్లో టీవీ.. ఇప్పుడు మొబైల్ ఫోన్‌తో ఈ-బుక్స్ పెరిగాయి. ఈ క్రమంలో వ్యాపారులు కూడా వాటి అమ్మకాలను తగ్గించేసి అకడమిక్ పుస్తకాల విక్రయానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

చివరిగా.. అది సాహిత్య గ్రంథమైనా.. అకడమిక్ బుక్ అయినా.. ఎప్పటికప్పుడు షెల్ఫ్‌లోకి కొత్త స్నేహితుల్లా చేరిపోతుంటాయి. అభిమాన పాఠకుల కోసం.. వారి ఆత్మీయ స్పర్శ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుంటాయి. పక్క పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న పుస్తకాలు అసలు రాత్రిళ్లు ఏం మాట్లాడుకుంటాయో..!

–విశాఖపట్నం డెస్క్

ఏడేళ్లుగా విక్రయిస్తున్నా..



మా వద్ద 6వ తరగతి నుంచి అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలు దొరుకుతాయి. ముఖ్యంగా ఇంటర్, డిగ్రీ, బీటెక్, మెడికల్, పోటీ పరీక్షల పుస్తకాలను విక్రయిస్తుంటాం. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది పుస్తకాలు కొనుగోలుకు వస్తుంటారు. నేను ఏడేళ్ల నుంచి ఇక్కడ పుస్తకాలు విక్రయిస్తున్నాను. పుస్తకాల అసలు ధరను అనుసరించి 50 శాతం రేటు తగ్గించి విక్రయిస్తుంటాం. కాలేజీలు, పాఠశాలలు తెరిచే సమయంలో అమ్మకాలు బాగుంటాయి. తర్వాత అంతగా అమ్మకాలు ఉండవు. రోజుకు ఎలా లేదన్నా రూ. 500 వరకు గిట్టుబాటు ఉంటుంది. పుస్తకాల అమ్మకాల్లో పోటీ కూడా ఎక్కువగానే ఉంది. డాల్ఫిన్ హోటల్, పోలీస్ కమిషనరేట్, సూపర్ బజార్ తదితర ప్రాంతాల్లో ఓల్డ్ బుక్స్ విక్రయ కేంద్రాలున్నాయి. ఉదయం కంటే సాయంత్రం పూట కాస్త బిజినెస్ ఉంటుంది.

– రాజేష్, కామేశ్వరీ ఓల్డ్ అండ్ న్యూబుక్స్ సెంటర్, డాల్ఫిన్ హోటల్ సెంటర్

డిటెక్టివ్ బుక్స్ ఎక్కువగా అమ్మేవాళ్లం..



నేను 17 ఏళ్ల నుంచి ఇక్కడ ఓల్డ్‌బుక్స్ విక్రయిస్తున్నాను. అంతకు ముందు మా నాన్న మోహన్ ఇక్కడ 40 ఏళ్ల పాటు ఓల్డ్‌బుక్స్ విక్రయించేవారు. అప్పట్లో పాఠ్య పుస్తకాలతో పాటు డిటెక్టివ్ నవలలు, చందమామ, బాలమిత్ర, తెలుగు పాపులర్ నవలలు ఎక్కువగా అమ్ముడయ్యేవని మా నాన్న చెప్పేవారు. ఇప్పుడు వాటి అమ్మకాలు పడిపోయాయి. పాఠ్య, పోటీ పరీక్షల పుస్తకాల కోసమే విద్యార్థులు, నిరుద్యోగులు వస్తుంటారు. మాకు కొన్ని పుస్తకాలపై 50 శాతం, మరికొన్ని పుస్తకాలపై 30శాతం వరకు లాభం వస్తుంది. సీజన్‌లో బిజినెస్ బాగుంటుంది. తర్వాత తగ్గుతుంది. అలవాటైన పని కనుక ఇందులోనే కొనసాగుతున్నాను.

– దేవీ ప్రసాద్, ఓల్డ్ బుక్స్ విక్రేత, ఇంద్రకీలాద్రి బుక్ సెంటర్, డాల్ఫిన్ హోటల్ సెంటర్

అన్ని పుస్తకాలు దొరుకుతాయి



డాల్ఫిన్ హోటల్ సెంటర్, డాబాగార్డెన్స్ ఓల్డ్ బుక్స్ షాపుల్లో మనకు కావాల్సిన అన్ని రకాల పాఠ్య పుస్తకాలు దొరుకుతాయి. నేను మా అబ్బాయి ఇంజినీరింగ్ బుక్స్ కోసం ఇక్కడికి వచ్చాను. మొత్తం 6 పుస్తకాలు కావాల్సి ఉండగా.. ఒకే చోట 5 పుస్తకాలు దొరికాయి. మరో పుస్తకం కోసం మిగిలిన షాపుల్లో చూస్తాను. పుస్తకాల అసలు ధర మీద 80 శాతం తీసుకుంటున్నారు. పుస్తకాల డిమాండ్‌ను బట్టి ఈ ధర నిర్ణయిస్తారని భావిస్తున్నాను.

– సంజయ్‌కుమార్, డాక్‌యార్డ్ ఉద్యోగి

ఓల్డ్ బుక్స్ ఉపయోగకరమే..



నేను, నా స్నేహితులు ఇంటర్, డిగ్రీ చదివేటప్పుడు ఇక్కడే చాలా పుస్తకాలు కొనుగోలు చేశాం. కొత్త పుస్తకాలు దొరకనప్పుడు.. ఓల్డ్ బుక్స్ స్టోర్‌లను సంప్రదిస్తుంటాం. కాస్త తీరిక చేసుకుని ఓపిగ్గా వెతికితే ఓల్డ్‌బుక్స్ అమ్మేవారి దగ్గర మనకి కావలసిన ఎటువంటి పుస్తకమైనా దొరుకుతుంది. పైగా సగం ధరకే.!

– డాక్టర్ యశ్వంత్ సాయిభాస్కర్, దొండపర్తి

కలెక్టర్ కప్ పోటీలు ప్రారంభం

బీచ్‌రోడ్డు: కలెక్టర్ కప్ పోటీలను శుక్రవారం సిరిపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సర్వీసెస్ సహకారంతో నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో వివిధ విభాగాల నుంచి 300 మంది పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి సీహెచ్ ధనుంజయ నాయుడు, సురేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సింధు బంగారం

ఆరిలోవ: అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో పెదగదిలికి చెందిన చిన్నారి సింధు బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 5 నుంచి 9 వరకు నేపాల్‌లో అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో ఐదేళ్ల లోపు చిన్నారుల విభాగంలో ఇన్‌సైడ్ స్పీడ్ లాంగ్ రేస్, షార్ట్ రేస్‌లలో సింధు ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు గెలుపొందింది. ఈ మేరకు శుక్రవారం పెదగదిలిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని తల్లిదండ్రులతో చిన్నారి కలిసింది.

మేయర్ చిన్నారిని అభినందిస్తూ.. విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారికి శిక్షణ ఇస్తున్న కోచ్‌లతో పాటు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోస్తనీలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

తగరపువలస: భీమిలి జోన్ పాతవంతెన వద్ద గోస్తనీలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. అతని వయసు సుమారు 45 ఏళ్లు ఉంటుంది. నల్లటి జీన్, నలుపు, ఆకుపచ్చ రంగులు కలిసిన చెక్స్ కలిగిన షర్టు ధరించి ఉన్నాడు. నదిలో మృతదేహం లభించిన చోట దొరికిన పాన్‌కార్డులో దువ్వి పైడిరాజు అనే పేరు ఉంది. అతని చిరునామా తెలిస్తే 94409 04712కు ఫోన్ చేయాలని భీమిలి సీఐ డి.రమేష్ కోరారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.58,910
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,000
వెండి(కిలో):	రూ.77,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం	: రూ.115
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గోవిందరాజులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వజ్జిపర్తి

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గొంప గోవిందరాజులు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విశాఖకు చెందిన వజ్జిపర్తి శ్రీనివాసరావును ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరాజులు రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు సేవలందిస్తున్నారు. వజ్జిపర్తి శ్రీనివాసరావు 20 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ సిటీ లీగల్ సెల్ చైర్మన్‌గా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


గోవిందరాజులు


వజ్జిపర్తి శ్రీనివాసరావు

ప్రతి ముస్లిం గుండెలో వైఎస్సార్

'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాథ్'బ్రోచర్ ఆవిష్కరణ

సాక్షి, విశాఖపట్నం : ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేసి ప్రతీ ముస్లిం గుండెలో మహానేత వైఎస్సార్ ఉన్నారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. జగదాంబ మక్కామసీద్‌లో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.వి. బాబా ఆధ్వర్యంలో శుక్రజువారం 'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాథ్'అనే బ్రోచర్‌ను ఖాదర్ బాషా, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్. ఫరూకీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ సీఎం జగన్ ముస్లిం మైనారిటీల అభ్యుదయానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో 34,17,199 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 11,896 కోట్లు జమ చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన సంక్షేమ పథకాలకు పది రెట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 1.29 లక్షల ముస్లిం కుటుంబాలకు నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, హజ్ యాత్రకు వెళ్లే 1813 మంది ముస్లింలకు రూ.14.51 కోట్లు కేటాయించి.. మొత్తం భారాన్ని ప్రభుత్వమే భరించిందన్నారు. విశాఖ జోనల్ ముస్లిం విభాగం ఇన్‌చార్జి బర్కత్ అలీ, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, మసీద్ అధ్యక్షులు మున్నీర్, సెక్రటరీ అలిజన్ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా తదితరులు